RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 218 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 17-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**

పొడుపు పద్యం

ఆటవెలది

పొగను చిమ్ము నదియు భూతమ్ము గాదంట
పాకిపోవుచుండు పాముగాదు
కళ్ళునెర్రజేయు కాదురాకాసియు
తెలుసుకున్నవారు తెలివివరులు

(జవాబు:- రైలు)

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

# కసరత్తు షురూ

## నేటి నుంచి తెలంగాణ రైజింగ్ -2047

- విజన్ డాక్యుమెంట్‌పై మేధోమదనం
- బేగంపేటలోని ప్రజా భవన్ వేదికగా రూపకల్పన
- అన్ని శాఖల అధిపతులకు ఆదేశాలు



హైదరాబాద్ నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్): సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరి డిసెంబరు ఏడు నాటికి రెండేండ్లు పూర్తి కావస్తోన్న నేపథ్యంలో ద్వితీయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. ఇందులో భాగంగా వచ్చే నెల 8,9 తేదీల్లో చర్చించబోయే 'తెలంగాణ రైజింగ్, విజన్ డాక్యుమెంట్ – 2047' రూపకల్పనకు సోమవారం నుంచి కసరత్తులు షురూ కానున్నాయి. హైదరాబాద్ బేగంపేటలోని ప్రజా భవన్ ఇందుకు వేదిక కానుంది. ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యేందుకు అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు, విభాగాధిపతులు విధిగా హాజరు కావాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. డాక్యుమెంట్ రూపకల్పన ప్రక్రియ ఈనెలాఖరు వరకు కొనసాగనుంది. ఆ తర్వాత దానిపై ఒక నివేదికను రూపొందించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేయనున్నారు. ఆయన డిసెంబరు 7న ప్రజల ముందు ఉంచుతారు. దానిపై అదే నెల 8,9

-మిగతా 2 లో



## రెండు రాష్ట్రాలు కలిసి నడవాలి

- చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం
- తెలంగాణ, ఏపీ అభివృద్ధికి సహకరిస్తా
- రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఉప రాష్ట్రపతి సీపీఆర్
- తెలుగు భాష సంరక్షణకు కృషి: చంద్రబాబు

హైదరాబాద్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నెలకొన్న చిన్న చిన్న సమస్యలను ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చునని భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. కలిసి అడుగులు వేస్తే రెండు రాష్ట్రాలూ అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. ఇరు రాష్ట్రాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఆదివారం రామోజీ ఫిలింసిటీలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ఉప రాష్ట్రపతి హాజరయ్యారు.

-మిగతా 2 లో



## ఉపాధికి షాక్

- భారీ సంఖ్యలో కార్మికుల తొలగింపు
- అక్టోబర్ 10-నవంబర్ 14 మధ్య 27లక్షల మంది ఔట్
- ఏపీ నుంచి అత్యధికంగా 15.2 లక్షల మంది

న్యూఢిల్లీ

గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ)పై మోడీ సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది. గత కొన్నేండ్లుగా ఈ పథకాన్ని నీర్చు గార్చే విధంగా కొత్త కొత్త నిబంధనలను తీసుకొస్తూ లబ్దిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నది. కేంద్రం చర్యలతో లక్షలాది మంది లబ్దిదారులు ఈ పథకానికి దూరమవుతున్నారు. గతనెల 10 నుంచి ఈనెల 14 మధ్య దేశ్యాప్తంగా 27 లక్షల మంది ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కార్మికుల పేర్లను డేటా బేస్ నుంచి తొలగించినట్టు తెలుస్తున్నది. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచే అత్యధికంగా 15 లక్షల తొలగింపులు జరగటం గమనార్హం. దీంతో కేంద్రం చేపట్టిన ఈ-కేవైసీ, కొత్త డిజిటల్ విధానాలే లబ్దిదారులను ఈ పథకం నుంచి దూరం

-మిగతా 2 లో



## ఢిల్లీ పేలుడు.. కారు యజమాని అరెస్ట్

- ఆత్మాహుతి దాడి కోసం ఉమర్‌కి సాయం

న్యూఢిల్లీ

ఎర్ర కోట వద్ద ఈ నెల 10న జరిగిన ఆత్మాహుతి దాడి కేసు దర్యాప్తులో గొప్ప ముందడుగు పడింది. సూసైడ్ బాంబర్ టెర్రర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సహకరించిన కశ్మీరీ వ్యక్తి అమీర్ రషీద్ అలీని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఢిల్లీలో అరెస్ట్ చేసింది. ఈ ఉగ్రదాడికి ఉపయోగించిన హ్యుండయ్ ఐ20 కారు అమీర్ పేరు మీద రిజిస్టర్ అయినట్లు గుర్తించిన తర్వాత అతనిని అరెస్ట్ చేశారు. ఉమర్ వద్దకు ఈ కారు చేరడంలో సహాయపడటం కోసం అమీర్ కశ్మీరు నుంచి ఢిల్లీకి వచ్చాడు. ఈ కారులోనే ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లొసివ్ డివైస్ (ఐఈడీ)ని అమర్చి, ఉమర్ ఎర్ర కోట వద్ద ఆత్మాహుతి దాడి చేశాడు. ఈ కారులో కాలిపోయిన మృతదేహం ఉమర్‌దేనని ఫోరెన్సిక్ విశ్లేషణలో తేలింది. ఈ దాడి కోసం ఉమర్‌తో కలిసి అమీర్ కుట్ర పన్నినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది. టెర్రర్ డాక్టర్ ఉమర్ ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సంగతి తెలిసిందే.

-మిగతా 2 లో

## 100 సైట్లు.. వెయ్యిమంది హ్యాకర్లు

### ఐ బొమ్మ రవి అరెస్ట్‌తో కీలకవిషయాలు వెలుగులోకి..




- హార్డ్ డిస్కులు స్వాధీనం..ఏడు కేసులు నమోదు
- వెబ్‌సైట్లను క్లోజ్ చేయించిన పోలీసులు
- ఏడు రోజుల కస్టడీ కోరుతూ నేడు పిటిషన్ దాఖలు

హైదరాబాద్

సినిమాల పైరసీతో నిర్మాతలకు కోట్ల రూపాయల్లో నష్టం చేస్తున్న ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్‌సైట్లను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు క్లోజ్ చేయించారు. వెబ్ లాగిన్లను, సర్వర్ వివరాలతో మూసివేశారు. నిందితుడు ఇమ్మడి రవితోనే ఆ వెబ్‌సైట్లను క్లోజ్ చేయించి దమ్ముంటే నన్ను పట్టుకోండంటూ సవాల్ విసిరిన వ్యక్తితోనే ఆ సవాల్‌ను ఎదుర్కొన్నారని పోలీసుల్లో చర్చ జరుగుతుంది. ఐబొమ్మ నిర్వాహకుడు రవి వద్ద స్వాధీనం చేసుకున్న వందల హార్డ్ డిస్క్‌లను, బ్యాంక్ ఖాతాల వివరాలను

-మిగతా 2 లో



## స్థానికమే కీలకం


- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- విజన్ డాక్యుమెంట్, ప్రజా ప్రభుత్వ ద్వితీయ వార్షికోత్సవాలపై ప్రధాన చర్చ
- పథకాలపై సమీక్ష

హైదరాబాద్ నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్): సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు రాష్ట్ర మంత్రివర్గం భేటీ కానుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార పార్టీ విజయం సాధించిన నేపథ్యంలో ఇదే ఊపులో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సీఎం నిర్ణయించారు. అందువల్ల క్యాబినెట్‌లో ఈ అంశం కీలకం కానుంది. లోకల్ ఫైట్‌కు సంబంధించి ఏయే జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉంది? ఎక్కడెక్కడ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయి? బీసీ రిజర్వేషన్లు, దానిపై హైకోర్టులో కేసు, న్యాయస్థానం వెలువరించే తీర్పునుబట్టి ఎలాంటి వైఖరి తీసుకోవాలి? అనే అంశాలపై సీఎం, మంత్రులు ప్రధానంగా

-మిగతా 2 లో

## అమెరికాలో బర్డ్‌ఫ్లూ కలకలం

వాషింగ్టన్‌లో కేసు నమోదు



2 లో

## పత్తి రైతుల కష్టాలు పట్టించుకోండి

- మొద్దు నిద్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్



హైదరాబాద్ నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్): రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పట్టించుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆరు గాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, కేంద్రంలోని బీజేపీ పార్టీల ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్రానికి

-మిగతా 2 లో



## 19, 20 తేదీల్లో నితీశ్ ప్రమాణం!

- బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి..
- మంత్రివర్గంలో బీజేపీకి సింహభాగం

పాట్నా :

ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు కూటమి నేతలు చర్యలు చేపట్టారు. మరోసారి బీహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని కూటమి వర్గాలు పేర్కొన్నాయి. నవంబర్ 19 లేదా 20 తేదీలలో కొత్త ప్రభుత్వం కొలువు తీరే అవకాశం ఉన్నట్టు తెలిపాయి. ప్రమాణస్వీకారానికి 19 లేదా 20లలో ఏ తేదీని నిర్ణయిస్తారనే విషయం ప్రధాని మోడీ షెడ్యూల్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపాయి. ఇందుకు పాట్నాలోని గాంధీ మైదానం వేదిక కానున్నట్టు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం గాంధీ మైదానంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ఆదివారం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు సమర్పించింది. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం తెలిపే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ఈ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నీతీశ్ తన రాజీనామాను గవర్నర్‌కు సమర్పిస్తారు. తద్వారా కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమవుతాయి.

-మిగతా2 లో

## సామాజిక రుగ్మతలపై చైతన్యం

- రచనలకు అద్భుత స్పందన
- తదుపరి కార్యచరణపై మంత్రి జూపల్లి సమీక్ష
- ఎంపిక ప్రక్రియ వేగవంతం
- పారదర్శకంగా చేయాలని ఆదేశాలు



హైదరాబాద్ నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్): సామాజిక రుగ్మతలను రూపుమాపి, ప్రజల్లో పరివర్తన తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'ప్రభాత భేరి' పేరిట చేపట్టిన వినూత్న ప్రయత్నానికి అపూర్వ స్పందన లభించింది. సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కవులు, రచయితలు, కళాకారుల నుంచి కోరిన కథలు, కవిత్వం, పాటలు, సృజనాత్మక రచనలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం పురోగతి, అందిన ఎంట్రీల స్థాయి, తదుపరి చర్యలపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం

-మిగతా 2 లో

## 21న హైదరాబాద్‌లో పర్యటించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



న్యూఢిల్లీ నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్): : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21న హైదరాబాద్ నగరంలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో పోలీసులు భద్రతా చర్యలపై నిమగ్నమయ్యారు. ఇక 21న మధ్యాహ్నం 1.10 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు ద్రౌపది ముర్ము చేరుకుంటారు. మ. 1.30 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకుని, అక్కడే లంచ్ చేయనున్నారు. మధ్యాహ్నం 3.25 గంటల వరకు రాజ్‌భవన్‌లోనే రాష్ట్రపతి

-మిగతా 2 లో

# రెండు రాష్ట్రాలు కలిసి నడవాలి

(మొదటి తరువాయి)

దేశంలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజ హితమే లక్ష్యంగా పనిచేస్తున్న వారికి ఈ అవార్డులను రాధాకృష్ణన్ చేతులమీదుగా అందజేశారు. అవార్డు గ్రహీతలకు మొమెంటో, ప్రశంసా పత్రంతోపాటు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల నగదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు భాషను కాపాడుకోవడానికి రామోజీరావు స్ఫూర్తితో పనిచేస్తామని అన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ జీవోలు, ఇతర ఉత్తర్వులను ఇకపై తెలుగులోనే ఇస్తామని ప్రకటించారు.

**విశేష కృషికి పురస్కారాలు..**

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతల్లో.. చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టి జలసంరక్షణతో 18 లక్షల మంది గ్రామీణ ప్రజల జీవితాలను మార్చిన అమ్లా అశోక్ రుయాకు గ్రామీణాభివృద్ధి విభాగంలో అవార్డు దక్కింది. వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న శ్రీకాంత్ బొల్లాకు యూత్ ఐకాన్‌గా, ప్రపంచంలోనే ఎత్తైన కశ్మీర్‌లోని చినాబ్ వంతెనను డిజైన్ చేసిన బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ మాధవీలతకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పురస్కారాలు అందజేశారు. కాగా, మురికివాడల్లో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి.. వారి జీవితాల్లో మార్పు తెచ్చిన ఆకాశ్ టాండన్‌కు మానవతా సేవల విభాగంలో, కళలు-సంస్కృతి విభాగంలో సత్తుపతి ప్రసన్నకు, జర్నలిజంలో కృషికిగాను జైదీప్ హర్దేకర్‌కు, మహిళా సాధికారత కోసం పాటుపడిన పల్లబీ ఘోష్‌కు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# 100 సైట్లు.. వెయ్యిమంది హ్యాకర్లు

(మొదటి తరువాయి)

పరిశీలిస్తున్నారు. రవిని కస్టడీకి తీసుకుని మరిన్ని వివరాలు సేకరించాలని కోర్టులో ఏడురోజుల కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఏడు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఫిలిం చాంబర్ పైరసీ సెల్ విభాగంతో పాటు సినీ నిర్మాతల ఫిర్యాదులతో ఈ కేసులు నమోదయ్యాయి. సినీ ఇండస్ట్రీని టార్గెట్ చేసుకుని రవి బెదిరింపులకు పాల్పడినట్లు చెప్పారు.

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి.. పైరసీ రంగంలోకి..**

ఐబొమ్మ రవి అరెస్ట్‌తో కీలకవిషయాలు వెలుగు చూస్తున్నాయి. ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన ఇమ్మడి రవి తక్కువ సమయంలో డబ్బులు సంపాదించడమే లక్ష్యంగా పైరసీ రంగంలోకి దిగినట్లు తెలిపారు. ముంబై యూనివర్సిటీలో ఎంబీఏ చదివిన రవి పైరసీ రంగంలో కింగ్‌పిన్‌గా మారారన్నారు. సినిమా పైరసీకి సంబంధించి సుమారుగా వెయ్యి మంది హ్యాకర్లతో పెద్ద ఎత్తున పైరసీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వీరంతా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కొత్త సినిమాలు పైరసీ చేశారు. అయితే వీరంతా హై సెక్యూరిటీ ఉన్న సర్వర్లను సైతం హ్యాక్ చేస్తున్నారని, సినిమా నాణ్యతను బట్టి వంద నుంచి ఐదువందల డాలర్ల వరకు కమీషన్ సంపాదిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఐబొమ్మ మూసివేసినా మరో 65 ప్రాక్సి సైట్లను ముందస్తు జాగ్రత్తగా రెడీ చేసిన రవి మరో వంద సైట్లను తన సన్నిహితుల ద్వారా మేనేజ్ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

పైరసీ సినిమాలను అప్‌లోడ్ చేసే నిర్వాహకులు వాటి ఐపీ అడ్రస్‌లను ఎప్పటికప్పుడు మార్చుతూ ఒకరోజు ఢిల్లీ, మరోరోజు నెదర్లాండ్స్.. ఇలా నెలకు ఐపీ అడ్రస్‌లను మార్చిన సందర్భాలున్నాయని పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

# పత్తి రైతుల కష్టాలు పట్టించుకోండి

(మొదటి తరువాయి)

ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ అంశంలో మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, జిన్నింగ్ మిల్లుల అవినీతి, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో సీసీఐ కొనుగోళ్లను నిరాకరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో సీసీఐ కేవలం 1.12 లక్షల టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేసిందనీ, ఈ సీజన్‌లో అంచనా వేసిన 28.29 లక్షల టన్నుల ఉత్పత్తితో పోలిస్తే ఇది అత్యంత తక్కువని పేర్కొన్నారు.రాజకీయాలపైనే దృష్టి సారించకుండా, రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్ల సంక్షోభంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పత్తికి క్వింటాల్‌కు రూ. 8,110 కనీస మద్దతు ధర ఉండగా, సీసీఐ కొనుగోళ్ల లేక రైతులు అడ్డగోలు ధరకు ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# 19, 20 తేదీల్లో నితీశ్ ప్రమాణం!

(మొదటి తరువాయి)

**మంత్రివర్గంలో బీజేపీకి సింహభాగం**

కొత్త ప్రభుత్వంలో మంత్రివర్గ కూర్పునకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే గత శనివారం కేంద్రమంత్రి అమిత్‌షాతో కూటమి నేతలు భేటీ అయ్యారు. ఈ దఫా క్యాబినెట్‌లో బీజేపీకి ఎక్కువ బెర్తులు దక్కే వీలుంది. తర్వాతి స్థానంలో జేడీయూ ఇతర పార్టీలు ఉన్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్)కి 3 మంత్రి పదవులు ఇవ్వనున్నట్టు సమాచారం.

## 21న హైదరాబాద్‌లో పర్యటించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి తరువాయి)

విశ్రాంతి తీసుకోనున్నారు.మ. 3.50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం చేరుకుంటారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు భారతీయ కళా మహోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 6:15 గంటలకు తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. ఆ రోజు రాత్రికి రాజ్‌భవన్‌లోనే ద్రౌపది ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పుట్టపర్తికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బయలుదేరనున్నారు.

# అమెరికాలో బర్డ్‌ఫ్లూ కలకలం

## వాషింగ్టన్‌లో కేసు నమోదు

**వాషింగ్టన్ :** అమెరికాలో బర్డ్‌ఫ్లూ కలకలం సృష్టిస్తోంది. వాషింగ్టన్ రాష్ట్రంలో ఒక వ్యక్తికి బర్ట్‌ఫ్లూ వైరస్‌లో నూతన వేరియంట్ హెచ్5ఎన్5 సోకినట్లు గా గుర్తించారు. గురువారం ప్రాథమిక పరీక్షల్లో హెచ్5ఎన్5ను గుర్తించగా, శుక్రవారం ధ్రువీకరికం చారు. ఫిబ్రవరి తరువాత అమెరికాలో ఇది తొలి బర్డ్‌ఫ్లూ కేసు. తాజాగా గుర్తించిన ఇన్ఫెక్షన్ మునుపటి ఇన్ఫెక్షన్ల కన్నా భిన్నంగా ఉందని వైద్య అధికారులు తెలిపారు. బర్డ్‌ఫ్లూ సోకిన వ్యక్తి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ బర్డ్‌ఫ్లూ కేసుతో అమెరికా లో ప్రజారోగ్యానికి ప్రమాదం పెరిగిందని ఆ దేశ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ఒక ప్రకటనలో తెలిపింది

# కసరత్తు షురూ

(మొదటి తరువాయి)

తేదీల్లో చర్చలు, సమాలోచనలు ప్రభుత్వం నిర్వహించనుంది. విజన్ డాక్యుమెంట్‌లో వ్యవసాయ రంగపైన్నే ప్రధానంగా ఫోకస్ ఉండబోతోంది. దాని అనుబంధరంగాలైన పశు సంవర్ధక, కోళ్ల పెంపకం, మత్స్య పరిశ్రమాభివృద్ధి, గ్రామీణ చేతి వృత్తుల బలోపేతంపై నిపుణుల సలహాలను ప్రభుత్వం స్వీకరించనుంది. భారీ వర్షాలు, తుపాన్లు, వరదల నేపథ్యంలో అతలాకుతలమవుతోన్న రైతుకు వాటిని తట్టుకునేలా భరోసా కల్పించటం, స్థిరమైన ఆదాయాన్ని అతడికి వచ్చేలా చూడటమనేది తక్షణ కర్తవ్యంగా డాక్యుమెంట్‌లో చేర్చనున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, కుటీర పరిశ్రమల్లోని వారికి మెరుగైన వేతనాలు ఇప్పించేందుకు వీలుగా ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టనుంది. వాటిని డాక్యుమెంట్‌లో పొందుపరచనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డాక్యుమెంట్ రూపకల్పనలో విద్య, వైద్యం, క్రీడలు, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ,




ఉపాధి అవకాశాలు, మాతాశిశు సంరక్షణ, పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించటం తదితరాంశాలను జొప్పించనున్నామని సాధారణ పరిపాలన శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అర్బన్ ప్లానింగ్ కూడా అందులో ప్రధానాంశాలుగా ఉండబోతున్నాయి. విజన్ - 2047ను స్వల్ప కాలిక (2025-30), మధ్యకాలిక ((2030-39), దీర్ఘకాలిక (2039-47) అనే మూడు భాగాలుగా విభజించారు.

**హై పవర్డ్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు**

ప్రస్తుత రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా, పక్కాగా, పకడ్బందీగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు ప్రభుత్వం ఒక హైపవర్డ్ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. ఆ కౌన్సిల్‌కు సంబంధించిన ఆర్డర్‌ను జులై 25న ఆమోదించారు. ఆర్బీఐ మాజీ గవర్నర్లు, ప్రముఖ ఆర్థిక వేత్తలు డాక్టర్ దువ్వూరి సుబ్బారావు, డాక్టర్ రఘురామ్ రాజన్, సామాజిక కార్యకర్త, ఆర్టీఐ యాక్టివిస్ట్ అరుణా రారు, సమ్మిళిత వృద్ధి, ఆహార భద్రత నిపుణురాలు ప్రొఫెసర్ జయతీ ఘోష్, హక్కుల కార్యకర్త, ప్రముఖ న్యాయవాది హర్ష మందిర్‌తోపాటు మొత్తం 16 మంది ఈ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉంటారు. ఈ కౌన్సిల్‌కు, ప్రభుత్వానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) అందించనుంది.

# ఉపాధికి షాక్

(మొదటి తరువాయి)

చేస్తున్నాయని సామాజిక కార్యకర్తలు, మేధావులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో 10.5 లక్షల మంది కార్మికులు మాత్రమే కొత్తగా పథకంలోకి చేరారు. కాగా కార్మికుల తొలగింపు అసాధారణంగా ఉన్నదని సామాజిక కార్యకర్తలు, మేధావులతో కూడిన లిబ్ టెక్ అనేపరిశోధనా సంస్థ వెల్లడించింది. గత ఆరు నెలల్లో 15 లక్షల తొలగింపులు జరగగా.. ఒక్క నెలలోనే 27 లక్షల మంది కార్మికులు తొలగింపునకు గురయ్యారని సమాచారం. అంటే దాదాపు రెండు రెట్ల తొలగింపులు జరిగాయి. ఇది పలు అనుమానాలను రేకెత్తిస్తున్నదని సామాజిక కార్యర్తలు అంటున్నారు. లిబ్‌టెక్ విశ్లేషణ ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరంలోని తొలి ఆరు మాసాల్లో మొత్తంగా 83.6 లక్షల మంది కార్మికులు (నెట్ ఆడిషన్) చేరారు. తొలగింపులు 15.2 లక్షలుగా ఉన్నది. నవంబర్ నెల మధ్య వరకు చూస్తే కార్మికుల చేరికలు 66.5 లక్షలకు పడిపోయాయి. దీంతో ఒక్క నెలలోనే 17 లక్షల మంది కార్మికులు పథకానికి దూరమయ్యారు.

**ఈ-కేవైసీ పూర్తయిన రాష్ట్రాల నుంచి తొలగింపులు అధికం**

కాగా ఈ-కేవైసీ పూర్తి చేసిన రాష్ట్రాల్లో ఈ తొలగింపులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 78.4 శాతం మంది ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోగా.. అత్యధికంగా 15.92 లక్షల మంది కార్మికులు తొలగింపునకు గురయ్యారు. ఆ తర్వాత 67.6 శాతంతో రెండో స్థానంలో ఉన్న తమిళనాడు నుంచి 30,529 మంది, 66.6 శాతంతో మూడో స్థానంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి 1.04 లక్షల మంది కార్మికులు డేటా బేస్ నుంచి తొలగించబ డ్డారు. అయితే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మాత్రం ఈ తొలగింపులకు, ఈ-కేవైసీకి సంబంధం లేదని చెప్తోంది.

# ఢిల్లీ పేలుడు.. కారు యజమాని అరెస్ట్

(మొదటి తరువాయి)

**హర్యానా వైద్యురాలి అరెస్ట్**

వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌పై దర్యాప్తులో భాగంగా హర్యానాకు చెందిన డాక్టర్ ప్రియాంక శర్మను అరెస్ట్ చేశారు. ఆమె జమ్ముకశ్మీరులోని అనంత్‌నాగ్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలలో పని చేస్తున్నారు. జమ్ముకశ్మీరు పోలీస్ కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు ఆమెను అరెస్ట్ చేశారు. ఈ నెల 10న ఢిల్లీలోని ఎర్ర కోట వద్ద జరిగిన పేలుడు కేసు దర్యాప్తుతో కూడా ఈ దర్యాప్తుకు సంబంధం ఉంది. అనంత్‌నాగ్ ప్రభుత్వ వైద్య కళాశాలలో గతంలో పని చేసిన అదీల్‌ను ప్రశ్నించిన తర్వాత డాక్టర్ శర్మ పేరు వెలుగులోకి వచ్చింది. టెర్రర్ మాడ్యూల్‌కు లాజిస్టికల్, ఆర్థిక సహకారం అందజేసిన వారి పేర్లు బయటకు వచ్చాయి.

**ప్రజల పైకి మదర్ ఆఫ్ సాతాన్!**

'మదర్ ఆఫ్ సాతాన్' గా పిలిచే ట్రియాసిటోన్ ట్రైపెరాక్సైడ్(టీఏటీపీ)ను ఢిల్లీలోని ఎర్ర కోట వద్ద ఈ నెల 10న ఉపయోగించిన పేలుడులో ఉపయోగించారని పోలీసులు భావిస్తున్నారు. ఈ టీఏటీపీ పొడి కేవలం వేడి వల్ల పేలిపోతుంది. ఈ టీఏటీపీని ఢిల్లీ పేలుడులో ఉపయోగించారా లేదా అనే విషయంలో ఫోరెన్సిక్ నిపుణులు ఇంకా పరీక్షలు నిర్వహిస్తున్నారు. 2017లో బార్సిలోనా దాడులు, అదే ఏడాది మాంచెస్టర్ బాంబు పేలుడు, 2016లో బ్రస్సెల్స్ పేలుళ్లు, 2015 పారిస్ దాడిలో టీఏటీపీని ఉపయోగించారు.

**ఢిల్లీ పేలుడు స్థలంలో 9ఎంఎం బుల్లెట్లు**

సైనికులు మాత్రమే వాడే మూడు 9ఎంఎం బుల్లెట్లు ఘటనాస్థలంలో దొరకటం సంచలనంగా మారింది. ఈ మూడింట్లో ఒక బుల్లెట్ వాడేసినట్లు ఢిల్లీ పోలీస్ వర్గాలు తెలిపాయి. కేసు దర్యాప్తులో ఇది కొత్త కోణాన్ని సృష్టించిందని పోలీసులు భావిస్తున్నారు.

# స్థానికమే కీలకం

(మొదటి తరువాయి)

చర్చించనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబరు 7 నాటికి రెండేండ్లు పూర్తి కావొస్తున్న నేపథ్యంలో 'ప్రజా పాలన-ద్వితీయ వార్షికోత్సవాల'ను నిర్వహణలు, సభలు, సమావేశాలు, సదస్సుల ఏర్పాట్లు తదితరాంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేయనున్నారు. దీనికి కొనసాగింపుగా 'తెలంగాణ రైజింగ్-2047, విజన్ డాక్యుమెంట్' రూపకల్పన, అందుకోసం తీసుకోవాల్సిన ప్రాతిపదికలు, ఆ డాక్యుమెంట్ ఆధారంగా చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక మొదలగు అంశాలపై మంత్రివర్గం చర్చించనుందని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

**పథకాలపై సమీక్ష**

ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేకపోతోందంటూ ప్రతిపక్షాలు విమర్శించినప్పటికీ జూబ్లీహిల్స్‌లో అవేమీ పని చేయలేదని ముఖ్యమంత్రి, మంత్రులు చెబుతున్నారు. తమ రెండేండ్ల పాలనను ఓటు ద్వారా ప్రజలు ఆదరించారని వారు అభిప్రాయ పడుతున్నారు. అందువల్ల రానున్న రోజుల్లో ఇవే పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయటం, ఆరు గ్యారెంటీల్లో మిగతా వాటిపై దృష్టి సారించటం, ఆ మేరకు ఆదాయ వనరుల సమీకరణ, అందుకోసం ఎలాంటి నిర్ణయాలు, చర్యలు తీసుకోవాలి%ా% ఇలాంటి ముఖ్యమైన విషయాలపై క్యాబినెట్‌లో చర్చించనున్నారని సమాచారం.

**తెల్లారుజామున క్యాబినెట్ ఎజెండా**

ఏ సంస్థకైనా, ఏ వ్యవస్థకైనా 'సమావేశపు అజెండా' అనేది కీలకం. ఆ మీటింగుకు సంబంధించిన షెడ్యూల్, దాని ఎజెండాలోని ముఖ్యాంశాల సమాచారం కొద్ది రోజుల ముందుగా ఇవ్వటం నిర్వాహకుల ప్రాథమిక విధి. తద్వారా మీటింగులో పాల్గొనే సభ్యులు ఎజెండాలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అధ్యయనం చేయటమనేది ఇక్కడ ముఖ్యోద్దేశం. ఇది సమావేశానికి పరిపూర్ణతను చేకూరుస్తుంది. కానీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశపు ఎజెండాను మాత్రం అందుకు భిన్నంగా పంపుతున్నారని సమాచారం. క్యాబినెట్ ముందు రోజు వరకూ ఎజెండా పంపకుండా. ఏ రోజైతే మంత్రివర్గపు భేటీ ఉంటుందో.. అదే రోజు తెల్లారుజామున మూడు నాలుగు గంటలకు దాన్ని పంపుతున్నారని తెలిసింది. అది కూడా రెండొందల నుంచి మూడొందల పేజీలతో కూడిన ప్రతిని పంపుతున్నారు.

# సామాజిక రుగ్మతలపై చైతన్యం

(మొదటి తరువాయి)

హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్రం నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారుల నుంచి వందల సంఖ్యలో రచనలు పంపినట్టు అధికారులు మంత్రికి వివరించారు. కథలు, కవితలు, పాటలు, హరికథ, బుర్రకథలకు సంబంధించిన పలు రచనలు అందినట్టు చెప్పారు. ఈ సృజనాత్మక స్పందనపై మంత్రి జూపల్లి హర్షం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యాన్ని మేల్కొలిపే శక్తి కవులు, కళాకారుల్లో ఉంది. వచ్చిన రచనల్లో అత్యుత్తమమైన, ప్రభావవంతమైన, సందేశాత్మక రచనలను మూల్యాంకనం చేసే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించారు. సంక్రాంతిలోగా ఈ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపికైన రచనలతో ఒక ప్రత్యేక వివిధ కళా రూపాల్లో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి తదుపరి కార్యచరణను రూపొందించాలని సూచించారు. సమాజహితం కోసం సేవ చేస్తున్న ప్రతి రచయితను, కళాకారుడిని ప్రభుత్వం గౌరవించేందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## యాచారం పాఠశాలలో విద్యార్థులకు బెల్టులు, బ్యాడ్జీలు పంపిణీ





**యాచారం, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యాచారం మండలం నక్కర్త మేడిపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బెల్టులు, నేమ్ బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ప్రధాన ఉపాధ్యాయురాలు ఉదయశ్రీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిధులు సేకరించి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీకాంత్, గిరిజారాణి, పీఆర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్ గుప్త సహకారంతో విద్యార్థులకు బెల్టులు, బ్యాడ్జీలు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ గుప్త మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, బాగా చదువుతూ ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థి బన్నె శ్రీశైలం పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ, సామాజిక ఉద్యమాల నేత కే నారాయణకు జోహార్లు



**హైదరాబాద్ నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా నల్లగండ్లలో తన కూతురు ఇంటి వద్ద 15 నవంబర్ 2025 రాత్రి 11 గంటలకు క్యాన్సర్ వ్యాధితో కన్నుమూసిన ఉపాధ్యాయ, సామాజిక ఉద్యమాల నేత కే నారాయణ అంత్యక్రియలు ఈ రోజు ఉదయం నల్లగండ్లలో నిర్వహించబడ్డాయి. అంత్యక్రియలకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యావేత్తలు, సామాజిక ఉద్యమకారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులు అర్పించారు. రాజన్న సిరిసిల్లా జిల్లా ఓబులాపురం గ్రామంలో జన్మించిన నారాయణ 1971లో పంచాయితీరాజ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ఉపాధ్యాయ, విద్యా, సామాజిక ఉద్యమాలకు మరింత బలాన్ని చేకూర్చేందుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌ను తెలంగాణ ప్రాంతానికి విస్తరించడంలో విశేష కృషి చేశారు. కామన్ స్కూల్ విధానం, శాస్త్రీయ విద్యా విధానం, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపకల్పనలో ఆయన నాయకత్వం వహించారు. సంఘం నిర్ణయం మేరకు ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదిలి ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసి విద్యారంగానికి అంకితమయ్యారు. అనంతరం డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ అనంతరం న్యాయవాదిగా ప్రజా సమస్యల పరిష్కారానికి న్యాయపోరాటం చేశారు. డబ్బు కోసం ఆశపడని నిస్వార్థ వ్యక్తిగా ఆయన పేరు నిలిచింది. నారాయణ మరణం రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు తీరని లోటు. తొలితరం పోరాట నాయకుడిగా, ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆదర్శప్రాయుడిగా ఆయన నిలిచారు. అంత్యక్రియలకు టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, ఉపాధ్యాయ నాయకులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, సామాజిక ఉద్యమకారులు, స్థానిక ప్రజలు హాజరై నివాళులు అర్పించారు. కామ్రేడ్ నారాయణ మరణంపై టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసింది. ఆయన ఆశయ సాధన కోసం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలుపుతూ జోహార్లు అర్పించింది.

## ఓ బి సి ఎంప్లాయిమెంట్ లక్షదీవ్ లో జరిగే ఓ.బి.సి మీటింగ్ కు తెలంగాణ నుండి ఎన్ వి టి ,రాజు హాజరు



**దేవరకొండ నవంబర్ 16. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ బి సి ఎంప్లాయిమెంట్ అసోసియేషన్ హైదరాబాద్ సర్కిల్ లక్షద్వీప్ లో జరుగుతున్న ఓబిసి పార్లమెంటరీ మీటింగ్ నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గానికి చెందిన ఎన్ వి టి, రాజు, తెలంగాణ రాష్ట్రం నుండి హాజరవుతున్నారు. 18 రాష్ట్రాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు రానున్నారు. వారితోపాటు ఆరుగురు ఎంపీలు నేషనల్ కమిషనర్ ఓబిసి పార్లమెంట్ కమిటీ ఛైర్మన్ ఎస్బిఐ ఛైర్మన్ రానున్నారు ఓబీసీసమస్యల గురించి చర్చించనున్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.**



**దేవరకొండ నవంబర్ 16. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా ,డిండి మండలం జేత్య తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రామావత్ సుజాత, గౌతమి లు ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై, నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం,యన్నమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని యన్నమ్స్ఆసుపత్రికి చేరుకొని బాధిత క్షతగాత్రులను పరామర్శించి,వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని,మెరుగైన వైద్య అందించాలని వైద్య అధికారులను కోరిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ .ఎమ్మెల్యే తోపాటు డిండి మండలం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, జేత్య నాయక్ తండా మాజీ సర్పంచ్ రమావత్ కేళి కిషన్ నాయక్ పాల్గొన్నారు.

## బాలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**గోపాల్పేట,నవంబర్ 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గోపాల్పేట కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆటో లక్ష్మణ్ తండ్రి బాలయ్య మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షుడు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, వారి దుఃఖాన్ని తట్టుకొని ధైర్యంగా నిలవాలని మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవన్న యాదవ్, యాదయ్య, వనపర్తి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమ్మద్ మియా, వనపర్తి జిల్లా ఏఐపిసి ఉపాధ్యక్షుడు నాగార్జున, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సీనియర్ నాయకుడు ఎంట్ల రవి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు మన నేస్తాలు -శంకర్ గౌడ్



**వనపర్తి, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పుస్తకాలు విరాళంగా అందజేస్తున్నామని సాహితి కళావేదిక అధ్యక్షుడు పలుసు శంకర్ గౌడ్ తెలిపారు. పుస్తకాలు మన నేస్తాలని, చదువుల సంస్కృతి పెంపొందించుకోవడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శంకర్ గౌడ్ 200 పుస్తకాలను, రామశర్మ సాహిత్యానికి సంబంధించిన 100 పుస్తకాలను, అదనంగా మరో 100 పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ పుస్తకాలు సమాజానికి మార్గదర్శకాలని, ప్రతి ఒక్కరూ పఠన అలవాటు పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కవి జనజ్వాల, లైబ్రేరియన్ శ్రీనివాసులు, తేజ కుమార్, చైతన్య, చెన్నయ్య, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## మంత్రి వాకాటి శ్రీహరిని కలిసిన గుర్రం కేశవులు



**ఆమనగల్లు, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్) ::**
రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, యువజన క్రీడల శాఖ మంత్రి వాకాటి శ్రీహరిని ఆదివారం ఉదయం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు కలిశారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని, అన్ని ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా ఉన్న ఆమనగల్లు అభివృద్ధి కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మక్తల్ ఇన్చార్జి గవినోళ్ల బాలకృష్ణరెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**-రావిచెడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే**



**కడ్తాల్, నవంబర్ 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండల్ రావిచేడు గ్రామంలో బ్యాగరి రత్నమాల నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు బ్యాగారి రాములు దంపతులకు కొత్త బట్టలు పెట్టడం జరిగింది. గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆమన్ గల్ వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ శ్రీమతి యాట గీత నర్సింహా ,జిల్లా అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి , ఆమన్ గల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, కడ్తాల్ మండల అధ్యక్షులు బిచ్య నాయక్ , సింగల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, డాక్టర్ శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు బొప్పిడి రాఘవేందర్, కుమ్మరి యాదయ్య, మాజీ సర్పంచ్ వరకల జనార్దన్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి:

### ప్యాపిలి ఎస్సై మధుసూదన్



**ప్యాపిలి**
అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మధుసూదన్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా మెలగాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యలాపాలు ఆర్థిక, భూ సెటిల్‌మెంట్లు వంటివి చేస్తూ సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమం లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు .

# అనాధ ఆశ్రమంలో నిర్వహించిన పెళ్లికి హాజరైన ఎమ్మెల్యే



**వనపర్తి,నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి మండలం చిట్యాల గ్రామ శివారులోని చేయూత అనాధాశ్రమంలో ఆదివారం నిర్వహించిన వివాహానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. 2004లో అనాధగా ఆశ్రమంలో చేరిన మాధవి పెరిగిన అనంతరం, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి దంపతులు ఆమె వివాహాన్ని జటప్రోలు గోపులాపురం గ్రామానికి చెందిన సందీప్ తో నిర్వహించారు.అనాధలను ఆదుకుంటూ వారి భవిష్యత్తు కోసం ఇలా వివాహం నిర్వహిస్తున్న ఆశ్రమ నిర్వాహకుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మైనార్టీ నాయకులు రహీం, మాజీ సర్పంచ్ సూర్య చంద్రారెడ్డి, అంకుర్ వెంకటరెడ్డి, ఆర్యభవన్ శ్రీనివాస్, యువ కాంగ్రెస్ నేతలు ఆదిత్య, చీర్ల విజయ్ చందర్, లక్కాకుల సతీష్‌తో పాటు ఆశ్రమ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మైథిలి ఠాకూర్ విజయం చరిత్ర ఆత్మకం

## ప్రధాన కార్యదర్శి కల్పన



**వనపర్తి నవంబర్ 16( నీలగిరి ఎక్స ప్రెస్ ):**
బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం పట్ల ఆనందం వ్యక్తం చేసిన బీజేపీ ప్రధాన కార్యదర్శి వారణాసి కల్పన, ముఖ్యంగా ఆలీగర్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన మైథిలి ఠాకూర్ విజయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. 25 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా గెలవడం యువతకు స్ఫూర్తిదాయకమని ఆమె లేవనెత్తారు. బీజేపీలో చేరి నెల రోజుల్లోనే విజయం సాధించడం అసాధారణమైన విషయమని చెప్పారు.ఆధ్యాత్మిక అభిరుచులు కలిగిన గాయని మైథిలి ఠాకూర్ ఎక్కువ ముస్లిం జనాభా ఉన్న ప్రాంతంలో బెదిరింపులను లెక్కచేయకుండా పోటీ చేసి గెలిచిందని ఆమె పేర్కొన్నారు. రామమందిర ప్రారంభోత్సవంలో పాడిన పాటకు ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. మైథిలి 'నేషనల్ క్రియేటర్ అవార్డు' కూడా మోడీ చేతుల మీదుగా అందుకున్నదని అన్నారు.రాజకీయాలలో యువత, మహిళలకు అవకాశాలు కల్పించడంలో మోడీ పాత్ర కీలకమని కల్పన వ్యాఖ్యానించారు. 33% మహిళా రిజర్వేషన్ అమలు కారణంగా మహిళలు ఎన్నికల్లో ఎక్కువగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. బీహార్‌లో మహిళల అధిక ఓటింగ్ దానికే నిదర్శనమని చెప్పారు.వచ్చే స్థానిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం సాధిస్తుందని కల్పన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కన్నుల పండుగగా కార్తీక వనభోజనాలు



**కరీంనగర్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హనుమాన్ నగర్ ఆధ్వర్యంలో కొత్తపల్లి రామాలయంలో కార్తీక వనభోజనాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రార్థన గీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో ఆటల పోటీలు, భోజనం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగి విజేతలకు బహుమతులు అందజేశారు.కార్తీక మాసంలో ఉసిరి చెట్టు కింద భోజనం చేసే విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు.కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు గర్రెపల్లి శ్రీకాంత్, సెక్రటరీ చిట్టిమల్ల రామకృష్ణ, ట్రెజరర్ బొడ్ల శ్రీరాములు కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేశారు. కొత్తపల్లి రామాలయం చైర్మన్ నారాయణ రెడ్డి ఉచితంగా స్థలాన్ని అందించగా, ఆయనకు సంఘం తరపున శాలువాతో సన్మానం చేశారు.

# స్వరాభిషేకం ఆర్గనైజర్, ఫౌండర్, అడ్మిన్ శ్రావ్య శృతి ప్రేకాస స్టూడియో అధినేత సబిత మట్ల ఆధ్వర్యంలో అట్టహాసంగా స్వరాభిషేకం స్వరోత్సవం....





**హాజరైన సోషల్ వెల్ఫేర్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ...**

**కూకట్పల్లి, నవంబర్ 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్వరాభిషేకం ఆర్గనైజర్ ఫౌండర్ అడ్మిన్ శ్రావ్య శృతి ఆధ్వర్యంలో స్వరాభిషేకం స్వరోత్సవం కార్యక్రమం కూకట్పల్లి లోని ప్రేకాస స్టూడియోలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కరఒకే సింగింగ్ మీట్ 2025 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ స్టాప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, ప్రముఖ గాయకుడు సీనియర్ జర్నలిస్ట్ బి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. గాయకులు పలువురు తన గాన, గంధర్వ, కంఠంతో శ్రోతలను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ ఆధ్వర్యంలో స్వరాభిషేకం స్వరోత్సవం కరవోకే సింగింగ్ మీట్ 2025 కార్యక్రమం స్వరాభిషేకం ఆర్గనైజర్ ఫౌండర్ మరియు అడ్మిన్ శ్రావ్య శృతి అద్భుతంగా నిర్వహించారని కొనియాడారు.



కరవోకే సింగింగ్ మీట్ 2025 కార్యక్రమంలో సీనియర్ గాయకుల నుంచి అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని మధురమైన గానాలను ఆలపించి మానసికోత్సవాన్ని, ఉల్లాసాన్ని కలిగించారని కొనియాడారు. ఇదిలా ఉండగా స్వరోత్సవం కార్యక్రమం 2025 పర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ గా ఎంపికైన ప్రముఖ సింగర్ ఎన్నారై దివ్య కు ఘన సత్కారం జరిగింది. కరవోకే సింగింగ్ మీట్ 2025 కార్యక్రమంలో వి ఎస్ టి జనరల్ మేనేజర్ వెంకటేశ్వర రావు, సంతోష్, అవుగన నాగభూషణ్, జన విగ్నేష్, శ్రీనివాస్ రెడ్డి, ఉష, రిటైర్డ్ ఆఫీసర్ రామకృష్ణ, యాక్టర్ మరియు సింగర్ ఆనంది, వినయ్, కార్తికేయ, నరహరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వరాభిషేకం 8వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆర్గనైజర్, ఫౌండర్ మరియు అడ్మిన్ శ్రావ్య శృతి ఆధ్వర్యంలో కేక్ ను కట్ చేసి అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావ్య శృతి మరియు పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ ఎన్నారై దివ్య, సీనియర్ జర్నలిస్ట్ బి.వెంకటేశ్వర్లు మరియు గాయకులను టీం స్వరాభిషేకం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఇది ఇలా ఉండగా స్వరాభిషేకం స్వరోత్సవం కార్యక్రమానికి ప్రేకాస స్టూడియో అధినేతలు ప్రేమ్, సబిత మట్ల లు అమూల్యమైన సహకారాన్ని అందించారు.

# కుత్బుల్లాపూర్ హరిజన బస్తీ సమస్యలపై పర్యటన



**జీడిమెట్ల, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామం హరిజన బస్తీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను బస్తీ వాసులు తెలియజేయడంతో, బస్తీ లో పర్యటించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షులు గుడ్డి బలరాం, పెద్దింటి సాయిలు, బి. బాలరాజు, జి. పరమేష్, ఏ. యాదయ్య, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, ఏ. రమేష్, జి. రాకేష్, కే. రవి, పి. శ్రీహరి, పి. సత్యనారాయణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాస వనభోజనాల్లో హన్మంత్ రెడ్డి పాల్గొనడం



**నిజాంపేట్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి కృష్ణజ హిల్స్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలు వైభవంగా నిర్వహించారు. కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.తరువాత హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం కమిటీ వారు నిర్వహించిన మహిళల క్రికెట్ లీగ్‌లో విజేతలుగా నిలిచిన ఆడవారికి బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోడుప్పల్ రాజీవ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం



**బోడుప్పల్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బోడుప్పల్ రాజీవ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శ్రీ ఎస్వీఎస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. డివిజన్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకొని అవసరమైన మందులు పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి హాజరై మాట్లాడుతూ, "నా డివిజన్ ప్రజలు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలనేది నా ప్రధాన లక్ష్యం. ఈ ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినందుకు SVS హాస్పిటల్ వారికి నా తరపున, ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు" అని అభిప్రాయపడ్డారు.డబుల్ బెడ్రూమ్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్ మాట్లాడుతూ, "డబుల్ బెడ్రూమ్ ఇండ్లలో నివసించే వారు బడుగు బలహీన వర్గాలకు చెందినవారే. వారికి అందుబాటులో ఉచిత హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసిన డాక్టర్ రామ మేడం మరియు ఎస్వీఎస్ హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు. భవిష్యత్తులో కూడా మా లబ్ధిదారులు మీ దవాఖానకు వచ్చినప్పుడు తక్కువ ధరలో వైద్యం అందించాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు, కాలనీ ఉపాధ్యక్షుడు నానాజీ, ప్రధాన కార్యదర్శి తుక్కోజీ అమరేందర్, గౌరవ అధ్యక్షుడు అన్నందాసు బిక్షపతి, కోశాధికారి కిల్లరి అశోక్, సలహాదారులు కుమార్ స్వామి, శ్రీరాములు, సతీష్ కుమార్, బ్లాక్స్ ఇంచార్జ్ గౌరిగే సంతోష్ కుమార్, ఇదుల వెంకటేష్ ముదిరాజ్, బాలు, అజిజ్ బాయ్, వైద్య బృందం సభ్యులు పాల్గొన్నారు.

# సతీష్ కుమార్ కు నివాళులర్పించిన కుటుంబ సభ్యులు మిత్రులు



**పత్తికొండ నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిరుపతి పరకామణి కేసులో కీలక సాక్షిగా ఉన్న సతీష్ కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కొవ్వొత్తులతో ర్యాలీగా వచ్చి నాలుగు స్తంభాల కూడలిలో అమర హై అమరహై సతీష్ కుమార్ అమరహై అంటూ నినాదాలు చేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులు, బంధువులు,స్నేహితులు ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బంధువులు మిత్రులు మాట్లాడుతూ సతీష్ కుమార్ ని హత్య చేసిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని,వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

# పార్టీ పరమైన రిజర్వేషన్లు వద్దు చట్టపరమైన రిజర్వేషన్లు కావాలి

## సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.

**దేవరకొండ నవంబర్ 16. (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).** రాజ్యసభ సభ్యులు ఎంపీ ఆర్. కృష్ణయ్య విద్యా, ఉద్యోగ ,రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు అమలుకై హైదరాబాదులోని ఇందిరపార్కు వద్ద న్యాయ దీక్షకు మద్దతుగా దేవరకొండ పట్టణంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యాయ దీక్ష చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల పట్ల వివక్షత ,అన్యాయాన్ని విడనాడాలి. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి. పార్టీ పరమైన రిజర్వేషన్లు మాకు వద్దు చట్టపరమైనటువంటి రిజర్వేషన్లు కావాలి మోసం చేయొద్దని రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ ద్వారా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాల పార్టీలతో ఒత్తిడి తెచ్చి తమిళనాడు తరహాలో 9వ



షెడ్యూల్లో చేర్చి శాశ్వతమైనటువంటి పరిష్కారం చూపాలని కోరారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చోల్లేటి భాస్కరాచారి, పున్నం వెంకటేశ్వర్లు, రెడ్డి కోటేశ్వరరావు, అప్పం వీరయ్య, వరికుప్పల శ్రీను, వెంకటయ్య యాదవ్, లౌడ్య బాషా నాయక్ ,భీమగోని శివగౌడ్, కురుమయ్య ,పున్న భిక్షమయ్య బి. లక్ష్మయ్య,గంజి సత్యయ్య, వనం ముత్యాలు ,పెసర వెంకన్న, మద్దతుగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చందు నాయక్, మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి చంద్రమౌళి గౌడ్ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# టెక్స్ టైల్ ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలి

### అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు,కేంద్ర ఖాది,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం





**వరంగల్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వరంగల్ జిల్లాలో టెక్స్టైల్ డిజైనర్ ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలని అఖిలభారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. ఆదివారం ఖిలా వరంగల్ వాకింగ్ మైదానంలో జరిగిన పద్మశాలీల కార్తీక వనభోజనాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈగ మల్లేశం హాజరై శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ టెక్స్టైల్ డిజైనర్ ఇంజనీరింగ్ కాలేజీ. కేవలం గుజరాత్ రాష్ట్రంలో ఉందని, వరంగల్ జిల్లాలో టెక్స్టైల్ డిజైనర్ ఇంజనీరింగ్ కాలేజీ నెలకొల్పడం వల్ల ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వనభోజనాల వలన పద్మశాలీలలో స్నేహభావం పెరగడంతో పాటు సమస్యలు తెలుస్తాయన్నారు. పద్మశాలీల సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు గతంలో అనేకసార్లు విన్నవించిన పరిష్కారం కాలేదన్నారు. వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో చదువుకున్న పద్మశాలి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పద్మశాలీలలో వలసలు ఆగలేదని, ఇప్పటికీ అనేకమంది భీమండి, సూరత్, గుజరాత్ లాంటి ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సాధించి వలస కార్మికులను స్వరాష్ట్రం తీసుకువచ్చి ఉపాధి కల్పించాలన్నారు. పద్మశాలీలతో పాటు ఇతర కులస్తులు కార్తీక మాస వనభోజనాలకు రావడం సంతోషంగా ఉందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను నేటి తరానికి చెప్పవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కలుస్తామన్నారు.

# కేటీఆర్ కు అధికారం కోల్పోయినా.. అహంకారం తగ్గలేదు

### వరంగల్ కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్



**హన్మకొండ,నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కేటీఆర్ కు అధికారం కోల్పోయినా అహంకారం తగ్గలేదని అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వరంగల్ కాంగ్రెస్ సేవ దళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ అన్నారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ అహంభావంతో మాట్లాడటం సరికాదని సూచించారు. దేశానికే ఆదర్శవంతమైన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇల్లు,మహాలక్ష్మి పథకం, 21 వేల కోట్ల రుణ మాఫీ, సన్నాలకు 500 బోనస్ వంటి పథకాలు కేటీఆర్ కళ్ళకు కనిపించడం లేదా అని విమర్శించారు. ఉద్యమం చేసిన పార్టీ అని ప్రజలు రెండు సార్లు అధికారం ఇస్తే కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ పైన పడి దోచుకున్నారని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు ఎన్ని....ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎన్నో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ముందుగా తన చెల్లి కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఇంట్లో కుటుంబ సభ్యులనే ఒప్పించలేని స్థితిలో కేటీఆర్ ఉన్నాడని అన్నారు. కేటీఆర్ ముందు నీ ఇంటి వ్యవహారం చక్కదిద్దుకోని ఆతర్వాత ఇతరులను విమర్శించాలని సలహా ఇచ్చారు.ఎస్సీ, ఎస్టీ, బీసీలు గెలిస్తే కేటీఆర్ ఓర్చుకోలేకపోవడం విచిత్రంగా ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాలంటే అంత అలుసా.. అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలపై విచారణ జరుగుతోందని, త్వరలోనే అందరి లెక్కలు తేల్చుతామని హెచ్చరించారు. కేసీఆర్ ఫ్యామిలీ దొంగ జిమ్మిక్కులను ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సత్యనారాయణ వ్రతం పూజ

**హుస్నాబాద్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు సత్యనారాయణ వ్రతం పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి వాతావరణాన్ని మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దారు.మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి అవరోధాలు లేకుండా అన్నిట్లో విజయాలు చేకూరాలని ప్రార్థించారు.



# కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు





**సైనిక్‌పురి, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : సైనిక్‌పురి వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బీబీ నగర్ బ్రహ్మణపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక వనభోజనాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, జీవిత సభ్యుల కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ఆవరణలో, వూసిరి చెట్ల కింద కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివ స్తోత్రాలు, లలిత పారాయణం చేసి పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో వూసిరి చెట్ల కింద వనభోజనాలు జరిపి, భక్తులు ఆనందంగా గడిపారు.కార్యక్రమం ముగింపులో బ్రహ్మణపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్వాహకునికి కమిటీ తరఫున సన్మానం చేయడం జరిగింది.

# ఖమ్మంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభ




**మహేశ్వరం, నవంబర్ 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం -కందుకూరు మండలాల సిపిఐ కౌన్సిల్ సమావేశం నియోజకవర్గ కార్యదర్శి బి. దత్తు నాయక్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ, 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీ పేదల, కార్మిక -కర్షకుల శ్రేయస్సు కోసం పోరాటం చేస్తోందని గుర్తుచేశారు.ఈ సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో లక్షలాదిమంది పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.నియోజకవర్గ కార్యదర్శి బి. దత్తు నాయక్ మాట్లాడుతూ, సభకు పురస్కరించుకొని సరూర్నగర్, బాలాపూర్, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో జీపు జాతాలు నిర్వహించి పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.కార్యక్రమంలో పల్నాటి యాదయ్య, పి. దేవేందర్ గౌడ్, కొమ్మగళ్ల రాజు, ఎన్. యాదగిరి, సాయి, రామచంద్రయ్య, రమేష్, జోసెఫ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లమల్లలో ఘనంగా సామూహిక వివాహాలు



**అమ్రాబాద్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట పట్టణంలోని బిక్ గార్డెన్‌లో చరిత్రలో కనివిని ఎరగని రీతిలో సామూహిక వివాహాలు నిర్వహించబడ్డాయి. కౌన్సిలర్ అప్పశివ సొంత ఖర్చుతో 63 జంటలకు వివాహాలు జరిపి, నూతన దంపతులకు పట్టుబట్టలు, పుస్తెలతాడు, తాళిబొట్టు, మెట్టెలు, మంచం, బీరువాలు తదితర సామాగ్రి అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, సిపిఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనురాధ అభినందించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ, అప్పశివ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిరుపేదలకు వివాహాలు జరిపించడం ఆదర్శప్రాయమని, ఒకే వేదికపై 63 జంటలు ఏకమవడం సంతోషకరమని పేర్కొన్నారు. నూతన దంపతులు ఆదర్శప్రాయంగా జీవించి నవ సమాజానికి నాంది పలకాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అడ్వకేట్ గంగాపురం రాజేందర్, ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ మాధవరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత మల్లేష్, బ్లాక్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, కాశన్న యాదవ్, దర్గా కమిటీ చైర్మన్ రఫీ, మున్సిపాలిటీ ఏఈ రాజు నాయక్, కౌన్సిలర్లు, సిబ్బంది, సీనియర్ నాయకులు పోకల మనోహర్, తులసీరామ్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని పిలుపు

**తిరుమలగిరి, నవంబర్ 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెనకబడిన తరగతులకు 42% రిజర్వేషన్ కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమం చేపట్టాలని శాసన మండలి సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు.బీసీ జేఏసీ పిలుపు మేరకు తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బీసీ నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్ పెంపు విషయంలో రాష్ట్ర శాసనసభ, మండలిలో తీర్మానం చేసి బిల్లు కేంద్రానికి పంపినప్పటికీ, గవర్నర్ వద్ద పెండింగ్‌లో పెట్టి అమలు చేయకుండా కేంద్రం ఆటంకం కలిగించిందని విమర్శించారు. ప్రతి బీసీ బిడ్డ రిజర్వేషన్ సాధన కోసం ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని, బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పగిడి రామలింగయ్య యాదవ్ మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి బీసీలకు తీవ్ర నష్టం కలిగిస్తోందని అన్నారు.





బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ, జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్ పెంపు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తూ, బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం తగదని అన్నారు.బీసీ సంఘం నాయకుడు తమ్ముడబోయిన అర్జున్ మాట్లాడుతూ, రిజర్వేషన్ అమలు జరిగే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కేంద్రం తగిన చర్యలు తీసుకోకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో వెంకటేష్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్పలకు అన్నదానం మహాభాగ్యం

**అయ్యప్ప సేవ సమితి అధ్యక్షులు గణేష్ గుప్తా**



**శంషాబాద్ , నవంబర్ 16 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులు కఠిన నియయాలతో దీక్ష చేస్తారు. ఉదయాష్టమ సంధ్యలలో స్వామికి పూజలు చేస్తూ ఏకభుక్తం తింటూ 41 రోజుల పాటు దీక్షను కొనసాగిస్తారు. కఠిన నిమయాల్లో భిక్షకు అధిక ప్రాధాన్యత ఉంది. అని అయ్యప్ప సేవ సమితి అధ్యక్షులు గణేష్ గుప్తా . శంషాబాద్ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప స్వామి కు పూజ చేసి నిత్యభిక్ష కార్యక్రమం ప్రారంభించిన రాష్ట్ర నాయకులు మరియు అయ్యప్ప సేవ సమితి అధ్యక్షులు గణేష్ గుప్తా .ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని పూజా అనంతరం భిక్ష చేశారు.

# కొండపాకలో బీటీ రోడ్డు పనుల ప్రారంభం

**కొండపాక, నవంబర్ 16(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొండపాక మండల పరిధిలోని జప్తి నాచారం గ్రామపంచాయతీ పరిధిలో రాజంపల్లి చౌరస్తా నుండి జప్తి నాచారం గ్రామం మధ్యగా, కొండపాక రైస్ మిల్ వరకు 3.5 కిలోమీటర్ల దూరంలో 90 లక్షల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో గజ్వేల్ నియోజకవర్గంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం గ్రామాలలో సిసి రోడ్లతో పాటు బీటీ రోడ్లను కూడా ఏర్పాటు చేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల లోపే ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, 200 యూనిట్ల ఉచిత



కరెంటు, రేషన్ కార్డుల పంపిణీ, పది లక్షల ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గజవెల్లి సుదర్శన్, కొయ్యడ వెంకటేశం, మాజీ అధ్యక్షుడు సాయి బాబా, ఎంపిటిసి ఆంజనేయులు, ఎంపిటిసి మల్లేశం, దుద్దడ సర్పంచ్ మహదేవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్న శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు రమేష్, మద్దూరి శ్రీనివాస్, కొమురయ్య, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు సిద్ధులు, మల్లేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాజు, పెరుగు తిరుపతి, యాదయ్య, హోటల్ రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పంజా చిరంజీవి, యూత్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాస్, అడ్వకేట్ రాజు, పెద్దంకుల శ్రీకాంత్, పంభాల సురేందర్, శశిధర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి, మల్లికార్జున్, రాజయ్య గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో పాత్రికేయుల సేవలు మరువలేనివి.



**ఎలిగేడు, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సమాజంలో పాత్రికేయుల సేవలు మరవలేమని ఎలిగేడుమాజీ ఎంపీపీ తానుపర్తి స్రవంతి- మోహన్ రావు అన్నారు. ఎలిగేడులో ఆదివారం జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పాత్రికేయులకు మాజీ ప్రజా ప్రతినిధులు సన్మానం చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా నిలిచే సాధనాలు అన్ని వర్గాల అంశాలను, సమన్వయం చేస్తూ మంచి చెడులను ఎత్తిచూపి ఏ స్వార్థం లేకుండా సమాజ శ్రేయస్సు కోరుకునేది పత్రికలేనని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాత్రికేయలో ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు పాత్ర పోషిస్తూ సమాజ హితం కోసం పాటుపడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కొండ తిరుపతి గౌడ్, పెద్ది సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ తానిపర్తి వెంకటేశ్వరరావు, నాయకులు కప్పల ప్రవీణ్, కాంపల్లి బాపయ్య, అడ్డగుంట ప్రదీప్ గౌడ్ ,గట్టు రాజయ్య, ముద్రవేణి మహేందర్, ఓరుగంటి కనుకయ్య, రొట్టవేణి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# ఎలిగేడు వ్యవసాయ సహకార సంఘానికి ఎమ్మెల్యే రాక

**ఎలిగేడు, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)** : ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 72వ సహకార వారోత్సవాలు సందర్భంగా ఆయిల్ ఫామ్ సాగు విస్తరణపై అవగాహన సదస్సు నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు హాజరుకానున్నారు.సింగిల్ విండో చైర్మన్లు గోపు విజయభాస్కర్ రెడ్డి, పుల్లూరి వేణుగోపాలరావు, జిల్లా అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఎలిగేడు, ధూళికట్ట రైతు సోదరులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ అధికారులు కోరారు.



# వెంకట్ వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో వైభవంగా హెూమాలు

**కరీంనగర్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ వి కన్వెన్షన్‌లో వెంకట్ వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో పూర్వ, ప్రస్తుత ఉద్యోగుల అభివృద్ధి కోసం మరియు వారి పిల్లల విద్యాభివృద్ధి కోసం శ్రీ సరస్వతి, లక్ష్మి హయగ్రీవ హెూమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వ్యాపారం, ఆరోగ్యం కోసం నారాయణ హెూమం కూడా ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో సంస్థలో పనిచేసిన పూర్వ, ప్రస్తుత ఉద్యోగులు సకుటుంబంగా పాల్గొన్నారు. పూజారులు విద్యార్థులకు సరస్వతి దేవి మంత్రాన్ని ఉపదేశించారు. అనంతరం నారాయణ హెూమం నిర్వహించి మహా అన్నప్రసాద వితరణ జరిగింది.ఈ వేడుకలో వెంకట్ వ్యాపార సంస్థల అధినేత శ్రీ గంప వెంకట్ దంపతులు, డాక్టర్ జయరాములు దంపతులు పాల్గొని హెూమాలలో భాగమయ్యారు.



# అయ్యప్ప స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వైభవం

**తుర్కయాంజాల్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మితమైన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా ఆదివారం అంగరంగ వైభవంగా ప్రథమ వార్షికోత్సవ మహా పడిపూజ నిర్వహించారు.ఇబ్రహింపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి అనుగ్రహం పొందారు. "స్వామియే శరణం అయ్యప్ప శరణం శరణం అయ్యప్ప" నామస్మరణతో తుర్కయాంజాల్ అంతటా భక్తి తరంగాలు అలముకున్నాయి. పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరై భజన పాటలు, భక్తి గీతాలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దారు.భక్తులందరికీ అన్నప్రసాద వితరణ నిర్వహించగా, అయ్యప్ప స్వామి నామస్మరణతో గడిచిన ఈ మహా పడిపూజా మహెూత్సవం భక్తి వైభవంగా నిలిచింది.



# జై తెలంగాణ మాల మహానాడు

**జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంపత్**

**ఎలిగేడు, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
మండలంలోని ర్యాకల్ దేవ్ పల్లి గ్రామానికి చెందిన మద్దెల సంపత్ ను జిల్లా జై తెలంగాణ మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు దళిత రత్న నల్లాల కనకరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్దెల సంపత్ మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాలలో మాల మహానాడు కమిటీలను వేసేందుకు పూర్తి బాధ్యతలు అప్పగించారని నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు. మాల సామాజిక వర్గంలోని నాయకులు కార్యకర్తలు ప్రజలను సమన్వయపరిచి సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకరించిన మాల మహానాడు నాయకులందరికీ ఆయన పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.



# అయ్యప్ప మహా పడి పూజ ఘన వైభవం!

-మియాపూర్ హెచ్ఎంటీ కాలనీలో భక్తి శ్రద్ధల నడుమ వేడుకలు
-ప్రధాన అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అన్నెప ప్రభు ముదిరాజ్

**షాద్‌నగర్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మియాపూర్ హెచ్ఎంటీ కాలనీలో అయ్యప్ప స్వామివారి మహా పడి పూజ భక్తి శ్రద్ధల నడుమ విశేషంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ శ్రీకాంత్ నంబూద్రి గురుస్వామి, హేమంత్ గురుస్వామి ఆధ్వర్యంలో శోభాయమానంగా సాగిన ఈ పవిత్ర సేవలో భక్తులు అధిక సంఖ్యలో



పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నెప ప్రభు ముదిరాజ్ స్వామి దర్శనం చేసుకుని ఆశీస్సులు అందుకున్నారు.ఈ సందర్భంగా ప్రభు ముదిరాజ్ గురుస్వామి మాట్లాడుతూ"అయ్యప్ప స్వామి భక్తికి, సేవకు హద్దులుండవు. పడి పూజలు ప్రతి భక్తుడిలో ప్రేమ, సమానత్వం, ధర్మ మార్గాన్ని నింపుతాయి. ఇలాంటి పవిత్ర కార్యక్రమాల్లో పాల్గొనడం నా భాగ్యం" అని అన్నారు.కార్యక్రమంలో ఉదయ్ రాజ్, శ్రీను నాయక్ సహా అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారి కృప కోసం ప్రార్థనలు చేశారు. భక్తుల నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగి భక్తి ప్రపంచంగా మారాయి.

# ఘనంగా హనుమాన్ గాయత్రీ మహా యజ్ఞం



**నల్లగొండ,నవంబర్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పట్టణంలోని తులసీ నగర్ పట్టణంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం హనుమత్ గాయత్రి మహా యజ్ఞం ఘనంగా నిర్వహించారు స్వామివారి పూజ ఉత్సవ అనుజ్ఞ విఘ్నేశ్వర పూజ శైవ శుద్ధి మహా పుణ్యాహవాచనం మంటపార్చన మహాలక్ష్మి పూజ పంచామృత అభిషేకములు విశేషాలంకరణ అష్టోత్తర నాగవెల్లి దళార్చన అగ్ని ప్రతిష్టాపన గణపతి నవగ్రహ మాన్యుసూక్త హోమములు అనంతరం హనుమత్ గాయత్రీ మహా యజ్ఞం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు అనంతరం పూర్ణాహుతి నీరాజనం మంత్రపుష్పములు తీర్థ ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి కళాసిక కుశలయ్య, అర్చకులు పోతులపాటి శివప్రసాద్ శర్మ, గంగాపురం హరీష్ శర్మ, వంగిపురం హనుమంత ఆచార్యులు ,ఆలయ సిబ్బంది శేఖర్, గోదాదేవి, శీను, గురు స్వాములు ప్రభాకర్ రెడ్డి, కత్తుల జగన్, పూజిత, శీను, బద్రు నాయక్ ,జగన్ ,కృష్ణ ,బిక్షం ,విష్ణు, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నీలగిరి ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ధ్వజారోహణ మండల పూజ



**నల్లగొండ, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
స్థానిక ఎస్ ఎల్ బీసీ లోని నీలగిరి ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం ధ్వజారోహణ మండల పూజ ప్రారంభం కన్నుల పండుగ జరిగింది. వందలాది మంది స్వాములు పాల్గొని అయ్యప్ప పూజలు నిర్వహించారు అనంతరం స్వాములకు భక్తులకు అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బీరవెల్లి గోపాల్ రెడ్డి బాలయ్య అర్చకులు పెన్నా సుబ్రహ్మణ్య శాస్త్రి, మాజీ కౌన్సిలర్ చిన్నాల అలివేలు జానయ్య, కందికొండ శ్రీనివాస్, ఆమనగంటి బిక్షా రెడ్డి,కంజర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కటింగులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

## 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు



**పెద్దపల్లి, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాల్వ శ్రీరాంపూర్ మండలం మీర్జంపేట, వెన్నంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం రోజున ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు రైతులకు భరోసా కల్పించారు.ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుండి ఐదవసారి కొనుగోళ్లు జరుగుతున్నాయని, ఎప్పటిలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి కటింగులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేస్తామని, రైతులు వడ్లను ఆరబెట్టి 17 శాతం లోపు తేమ ఉండేలా చూడాలని సూచించారు. వడ్లను అమ్మిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.రైతులు కేవలం సెంటర్లలో వడ్లను అమ్మి ట్రక్ షీట్లు పొంది ఇంట్లోనే ఉండవచ్చని, రైస్ మిల్లులకు తిరగాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. సెంటర్లలో ఎలాంటి సమస్యలు ఎదురైతే నేరుగా తనను సంప్రదించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగాని సరయ్య గౌడ్, కాల్వ శ్రీరాంపూర్ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సదయ్య, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# శాంతి కై పోలీసుల తపన సఫలం

**మహబూబాబాద్,
నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహబూబాబాద్ జిల్లాలో శాంతి సౌహార్ద వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా శ్రమిస్తున్న పోలీసుల తపన ఫలించింది. నవంబర్ 15న నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మొత్తం 829 ఐపీసీ కేసులు న్యాయస్థానాల్లో విచారణ జరిపి చట్టబద్ధంగా కొట్టివేయబడ్డాయి. చిన్నపాటి గొడవలు, కుటుంబ తగాదాలు, వ్యక్తిగత వివాదాలు వంటి కేసులపై ఇరువర్గాల మధ్య రాజీ కుదిరిన కారణంగా ప్రజలకు భారీ ఉపశమనం లభించింది.అదే సమయంలో సైబర్ నేరాల పరిష్కారంలో కూడా పోలీస్ శాఖ విశేష ఫలితాలు సాధించింది. మొత్తం 39 కేసులు పరిష్కరించగా, అందులో ఎఫ్ఐఆర్ లేకుండా 13, ఎఫ్ఐఆర్ ఆధారంగా



26 కేసులు నమోదు అయ్యాయి. బాధితులు కోల్పోయిన రూ.16,04,000/- బ్యాంకులు, సైబర్ నోడ్, టెక్నికల్ టీమ్‌ల సహకారంతో తిరిగి రికవరీ చేయబడింది. ప్రజలకు నేరుగా ఆర్థిక ఉపశమనం అందించిన ఈ చర్య పోలీస్ శాఖ సేవాభావానికి ప్రతీకగా నిలిచింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ, “శాంతి కై పోలీసుల తపన ఫలించింది. ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా వ్యవస్థలను దగ్గర చేయడం మా బాధ్యత” అని పేర్కొన్నారు. 829 ఐపీసీ కేసుల పరిష్కారం, 39 సైబర్ కేసుల్లో రూ.16.04 లక్షల రికవరీ సాధించడంలో కీలకపాత్ర పోషించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కోర్టు డ్యూటీ అధికారులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, సైబర్ క్రైమ్ విభాగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ, న్యాయసేవల చేరువలో పోలీస్ న్యాయ వ్యవస్థల సమన్వయం మరింత బలోపేతం అవుతుందని ఎస్పీ అన్నారు.

# పారమిత వరల్డ్ స్కూల్‌లో డిజిటల్ లిటరసీ & ఆర్ట్ ఎగ్జిబిషన్



**కరీంనగర్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బాలల దినోత్సవం సందర్భంగా అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో రెండు రోజులపాటు డిజిటల్ లిటరసీ & ఆర్ట్ ఎగ్జిబిషన్ అంగరంగ వైభవంగా జరిగింది. సుమారు 200 మంది విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాల్గొని, స్వతంత్ర ప్రతిభను ప్రతిఫలించేలా ప్రదర్శనలో భాగమయ్యారు.సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మీడియా వంటి ఆధునిక అంశాలను విద్యార్థులు మోడల్స్, పోస్టర్ల రూపంలో ఆకర్షణీయంగా ఆవిష్కరించారు. అదేవిధంగా, వారి సృజనాత్మకతను ప్రతిబింబించే చిత్రాలు, కళాకృతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పారమిత పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఈ. ప్రసాద్ రావు విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ ప్రసూన, వి.యు.ఎం. ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్, ఆర్ట్ టీచర్ చిరంజీవి చారి, కంప్యూటర్ ఉపాధ్యాయులు ఎ. సతీష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దర్శనానికి జిల్లా కలెక్టర్



**సిద్ధిపేట, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కార్తీక మాసం సందర్భంగా ఆదివారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి కుటుంబ సభ్యులతో కలిసి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, వేదపండితులు కలెక్టర్ కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయంలోకి తీసుకెళ్లి సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో జిల్లా అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు.తరువాత వచ్చే నెలలో జరగనున్న శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణం, అలాగే ఉగాది వరకు కొనసాగనున్న జాతర ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

# కార్తీక మాస వనభోజనాల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గ్రామంలో ఆర్య వైశ్య మిత్ర మండలి ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.తరువాత ఆంజనేయ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదోపదేశంతో విప్‌కు ఆశీర్వచనం అందించారు. స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ఆయన ప్రార్థించారు.

# మసాయిపేట వద్ద రోడ్డ ప్రమాదం మహిళ మృతి

**మసాయిపేట, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మెదక్ జిల్లా మసాయిపేట వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన చందుపాటి లక్ష్మి దుర్మరణం చెందింది. స్థానికుల సమాచారం మేరకు చేగుంట వైపు నుండి తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై ఇస్లాంపూర్‌కు వస్తుండగా, మసాయిపేట వద్ద వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.ఈ ఘటనలో భర్త, కుమారుడు గాయపడి అంబులెన్సులో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఒక కుమార్తె కూడా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# నల్గొండ కేంద్ర గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం




**నల్గొండ, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన నూతన డిజిటల్ లైబ్రరీ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ లైబ్రరీ ఫౌండర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ గ్రంథాలయ సమాచార శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్ హాజరై పాఠకులకు డిజిటల్ లైబ్రరీ వినియోగంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. ఇంటర్నెట్ ద్వారా సమాచారం వనరులు వెతకడం, ఈ–బుక్స్, ఈ–జర్నల్స్, ఈ–మేగజైన్స్, ఈ–డేటాబేస్‌లు, ఎలక్ట్రానిక్ న్యూస్‌పేపర్స్, పేటెంట్స్, పోటీ పరీక్షల వీడియో ఉపన్యాసాలు, మొబైల్ అప్లికేషన్లలో అందుబాటులో ఉన్న వనరులపై ఆయన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రమీల ఉపాధ్యాయురాలు పాఠకులకు యోగ శిక్షణ ఇచ్చి, పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు.జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బాలమ్మ, గాధ వినోద్ రెడ్డి, మాజీ చైర్మన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠకులు పాల్గొని ఈ 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేశారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో వ్రతం నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి దంపతులు



**ఆమనగల్, నవంబర్ 16(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ పురాతన వెంకటేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా జరిగింది. ఈ వ్రతంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవి దంపతులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.కుటుంబ సభ్యులు, బంధువులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొని వ్రతాన్ని విజయవంతం చేశారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు

**ముగ్గురు వ్యక్తులను పట్టుకున్న కరీంనగర్ రూరల్ పోలీసులు**



**కరీంనగర్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుంటూరుపల్లి, బొమ్మకల్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. దుర్శేడ్ గ్రామానికి చెందిన నేరెళ్ల చరణ్, గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి లోకేష్, ఒక మైనర్ బాలుడు యమహా మోటార్ సైకిల్‌పై గంజాయి తీసుకువెళుతుండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద గంజాయి ఉన్నట్లు బయటపడింది. విచారణలో ముగ్గురు వ్యక్తులు చదువులు మధ్యలోనే మానివేసి జల్సాలకు అలవాటు పడి, అవసరాలను తీర్చుకోవడానికి గంజాయి కొనుగోలు చేసి కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో అమ్ముతూ లాభాలు పొందుతున్నట్లు వెల్లడైంది. ఈ రోజు కూడా అమ్మకానికి వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుండి 260 గ్రాముల గంజాయి, ఒక యమహా మోటార్ సైకిల్, కొంత నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ యువత చెడు అలవాటులకు బానిసలుగా మారకూడదని, జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. గంజాయి అమ్ముతూ పట్టుబడిన వారిని జైలుకు పంపడంతో పాటు రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని, ఇంకా మారకపోతే పీడీ ఆక్ట్ కూడా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ గంగానీ పట్టుకోవడంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బంది కీలక పాత్ర పోషించగా, వారి కృషిని కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయకుమార్ అభినందించారు.

# పెద్దపల్లిలో ఉవ్వెత్తున రన్ ఫర్ సోషల్ జస్టిస్




**పెద్దపల్లి, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలో ఆదివారం నాడు రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి జిల్లా బిసి జెఎసి చైర్మన్ దాసరి ఉషక్క ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐటిఐ గ్రౌండ్ నుండి అయ్యప్ప స్వామి ఆలయం వరకు బిసి నినాదాలతో ఊరంతా మార్మోగింది. దాసరి ఉషక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బిసి జేఏసీ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, బుద్ధుడి అష్టాంగ మార్గాల్లో ఒకటైన ఈ రన్ ఫర్ జస్టిస్ ద్వారా బిసి ఉద్యమాన్ని గ్రామ గ్రామానికి, గడప గడపకు తీసుకెళ్లి బిసి యోధులను తయారుచేసుకుంటామని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి న్యాయసాధన కోసం ఎంత దూరమైనా వెళ్ళడానికి సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఐటిఐ వాకర్స్ అసోసియేషన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బిసి జెఎసి వైస్ చైర్మన్ కొండి సతీష్, మహిళా కన్వీనర్ శిరవేణ స్వప్న, కన్వీనర్లు సలేంద్ర కొమురయ్య, బొల్లం భూమేష్, సోషల్ మీడియా ఇంచార్జ్ అబ్దుల్ మాలిక్, సుల్తానాబాద్ మండల బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు యాదవ్, అరుణక్క, పెద్దపల్లి మండల మీసేవ అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్, నోమురి శ్రీధర్ రావు, రాచకొండ మల్లయ్య, శాజుద్దీన్, సుధాకర్, రవి ముదిరాజ్, జె. శ్రీనివాస్, నరేందర్, తుంగ సతీష్, లాలు యాదవ్, అలువాల రాజేందర్, రాము, మహేష్, సయ్యద్ హఫీజ్, బిసి సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి వాకటి శ్రీహరికి పూలమొక్క అందజేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే నాగరాజు...**



**వర్ధన్నపేట నవంబర్16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హన్మకొండ జిల్లా జె ఎన్ ఎస్ స్టేడియం స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభానికి విచ్చేస్తున్న తెలంగాణ రాష్ట్ర మత్స్య, క్రీడా మరియు యువజన సర్వీసులు, పశుసంవర్ధక పాడిపరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రివర్యులు వాకటి శ్రీహరిని మడికొండ జంక్షన్ నందు పూలమొక్క అందజేసి శాలువాతో సత్కరించి పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు... ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు మంత్రి గారిని స్వాగతం పలికారు.....

# జాగృతి బలోపేతానికి త్వరలోనే కమిటీలు



**కరీంనగర్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా జాగృతి ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ హాజరై, జిల్లాలో జాగృతిని బలోపేతం చేయడానికి అవసరమైన సూచనలు అందించారు. రూప్ సింగ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో జాగృతి అనుబంధ విభాగాల కమిటీలు, మండల కమిటీలు, జిల్లా స్థాయి కార్యవర్గాలను ఏర్పాటు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కవితక్క చేపట్టిన జనం బాటా కార్యక్రమానికి ప్రజల నుండి విశేషమైన స్పందన వస్తోందని, ఎక్కడికక్కడ ప్రజలు తమ సమస్యలను వినతి పత్రాల రూపంలో తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ త్వరలోనే అన్ని కమిటీలను పూర్తి చేసి గ్రామస్థాయి నుండి జాగృతిని బలోపేతం చేస్తామని, ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేరేవరకు ప్రజల పక్షాన కవితమ్మ నాయకత్వంలో ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే చాలామంది జాగృతిలో చేరారని, భవిష్యత్తులో మరింత మంది చేరి జిల్లాలో తిరుగులేని శక్తిగా జాగృతిని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మైనారిటీ మహిళల నాయకురాలు నౌసీన్‌తో పాటు పలువురు జాగృతిలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, మాజీ ఉప సర్పంచ్ బుడిగ పర్శరం గౌడ్, గాలిపల్లి రత్నాకర్, పెండ్యాల మహేష్, అపర్ణ, సంగీత రెడ్డి, రంగరవేణి లక్ష్మణ్, యం.ఎ. రాజీ, సంగీత, సరూప, లక్ష్మణ్, యాకుబ్, తిరుపతి, పిట్టల సత్యం, సురేందర్ రెడ్డి, కొత్తూరి రఘు, హుస్సేన్, రోజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ భరోసా కేంద్రాన్ని సందర్శించిన సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా పోలీసు కమిషనర్ గౌష్ ఆలం నగరంలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం పనితీరును సమీక్షించారు. బాధిత మహిళలకు భరోసా కల్పించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు అందించిన సేవలు, వాటి సత్ఫలితాలపై సీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. గత సంవత్సరం డిసెంబర్ 22న అప్పటి డీజీపీ జితేందర్ ప్రారంభించిన ఈ కేంద్రం, మహిళలు మరియు చిన్నారులు లైంగిక వేధింపులు లేదా చిత్రహింసలకు గురైన సందర్భాలలో ఒకేచోట న్యాయ సహాయం, వైద్యం, సైకోథెరపీ అందించే లక్ష్యంతో ఏర్పాటైంది. బాధితులకు తక్షణ స్పందనతో అండగా నిలుస్తోందని సీపీ గౌష్ ఆలం తెలిపారు. భరోసా కేంద్రం ద్వారా ఇప్పటివరకు 45 పాక్సో కేసులు, 15 అత్యాచార కేసులు, 3 ఇతర కేసులు నమోదు కాగా, 59 స్టేట్‌మెంట్లు సెక్షన్ 180 ప్రకారం, 54 స్టేట్‌మెంట్లు సెక్షన్ 183 ప్రకారం రికార్డు చేశారు. 43 మందికి వైద్య సహాయం అందించగా, 44 అవగాహన కార్యక్రమాలు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో నిర్వహించారు. అదనంగా 3 శిక్షణా కార్యక్రమాలు, 2 ప్రసవాలు, 6 గర్భస్రావాలు, 39 ఇంటి వద్ద బాగోగులు తెలుసుకునే సందర్శనలు చేపట్టారు. నష్టపరిహారం కోసం 39 మంది బాధితుల తరపున దరఖాస్తులు సమర్పించగా, ఇప్పటివరకు 11 మందికి రూ. 3,50,000/- నష్టపరిహారం అందజేయడం జరిగిందని సీపీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీలత, ఎస్సై మనీషా, భరోసా కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో బూత్ సమ్మేళనం

**యూనిటీ మార్చ్ విజయవంతం చేయాలని బీజేపి పిలుపు**



**హుజురాబాద్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈనెల 19న హుజురాబాద్‌లో జరగనున్న కరీంనగర్ పార్లమెంట్ స్థాయి బూత్ కార్యకర్తల సమ్మేళనం, అలాగే సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తలపెట్టిన యూనిటీ మార్చ్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా బీజేపి అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హుజురాబాద్‌లో జరిగిన బీజేపి ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, సోషల్ మీడియా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం జరగనుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. రెండేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలన, ఆరు గ్యారంటీల మోసాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టడానికి, అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి హుజురాబాద్‌లో బుధవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కరీంనగర్ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి బస్టాండ్ వరకు నిర్వహించనున్న యూనిటీ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తగిన కృషి చేయాలని ఆయన కోరారు. ఈ మార్చ్‌లో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. ఐక్యత మార్చ్‌లో పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, మండల అధ్యక్షుడు రాముల కుమార్, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు రాజు, వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ం

# 15 కేసుల మిస్టరీ ఛేదన, ఆరుగురు అరెస్టు

**రూ. 20 లక్షల విలువైన దొంగిలించిన సొత్తు స్వాధీనం**






**కరీంనగర్, నవంబర్ 16 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లాలో గత కొన్ని నెలలుగా రైతులు, పౌరుల ఆస్తులకు నష్టం కలిగించిన దొంగతనాల కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ప్రధానంగా కాపర్, కరెంట్ మోటార్ వైర్ దొంగతనాలు, అలాగే పశువులు, పందులు, గొర్రెలు-మేకల దొంగతనాల కేసులు కలిపి మొత్తం 15 కేసుల మిస్టరీని ఛేదించి, ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. చొప్పదండిలోని గుమ్లాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా వెళ్తున్న బోలెరో క్యాంపర్, అశోక లేల్యాండ్ వాహనాలను ఆపి తనిఖీ చేయగా, ఈ దొంగతనాలలో పాల్గొన్న నిందితులు పట్టుబడ్డారు. దర్యాప్తులో వీరు పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో పాల్గొన్నట్లు తేలింది. దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన స్క్రాప్ వ్యాపారి కూడా అరెస్టయ్యాడు. పట్టుబడిన నిందితులు మనుపాటి శేఖర్, మనుపాటి సంజీవ్, ఉండాటి మహేశ్, బోదాసు కుమార్, సాగర్ల రంజీత్, బొడిగే సంపత్‌గా పోలీసులు గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడు మనుపాటి శేఖర్ దొంగిలించిన సొమ్మును వాహనాల కిస్తీలు కట్టడానికి, జల్సాలకు ఖర్చు చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు ఒక బోలెరో వాహనం, ఒక అశోక లేల్యాండ్ వాహనం, ఒక మోటార్ సైకిల్, మూడు క్వింటాళ్ల కాపర్ వైరు స్వాధీనం చేశారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 20 లక్షలుగా అంచనా వేయబడింది. కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు ఏసీపీ జి. విజయ కుమార్ నేతృత్వంలో ఈ కేసులను ఛేదించారు. ఈ బృందంలో సిఐ ఏ. ప్రదీప్ కుమార్, ఇన్స్పెక్టర్ సంజీవ్, ఎస్ఐ నరేష్ రెడ్డి, ఎస్సై వంశీ కృష్ణతో పాటు సిబ్బంది అనిల్, రాజ్ నాయక్, హేమసుందర్, శ్రీనివాస్, హసనోద్దీన్, రవీందర్, సృజన్ తదితరులు కృషి చేశారు. వారి కఠినమైన కృషిని సీపీ అభినందించారు. పట్టుబడిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని రిమాండ్‌కు తరలించనున్నట్లు, పరారీలో ఉన్న మిగిలిన ఎనిమిది మంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సీపీ తెలిపారు.ం